batukammanews.com

TEL/2019/78873

# బతుకమ్మ

10 ఆగస్టు 2026
సోమవారం

తాజా వార్తల సద్దిమూట

## పెద్ది జ్ఞాపకాల్లో కేసీఆర్ కంట కన్నీరు

### కుటుంబానికి పెద్దదిక్కుగా నేనున్నానంటూ భరోసా

### పిల్లలకు రూ.2 కోట్ల ఆర్థిక సాయం

02



నల్లబెల్లి, బతుకమ్మ : అనారోగ్యంతో చికిత్స పొందుతూ అకాల మరణం చెందిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం పరామర్శించారు. ఎర్రవెల్లి నివాసం నుంచి నల్లబెల్లికి చేరుకున్న కేసీఆర్, పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య స్వప్న, కుమారుడు నిదర్శన్ రెడ్డి, కుమార్తె ధర్మిష్ట, తల్లి అమృతమ్మతో పాటు కుటుంబ సభ్యులను కేసీఆర్ ఓదార్చారు. పెద్ది ఇక భౌతికంగా మన మధ్య లేరని బాధపడవద్దని, ధైర్యం కోల్పోవద్దని వారికి భరోసా ఇచ్చారు. "పెద్ది లేడని బాధపడకండి.. మీకు పెద్దన్నగా నేనున్నా. ఈ కుటుంబానికి నేను, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటాం" అంటూ కేసీఆర్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పెద్ది పిల్లలను అక్కున చేర్చుకున్న కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తన ఆత్మీయుడిని తలుచుకుంటూ కాసేపు విషణ్ణ వదనంతో మౌనంగా ఉండిపోయారు. ఎప్పుడూ చిరునవ్వుతో, కల్మషం లేని మనసుతో అందరితో ఆప్యాయంగా మెలిగే పెద్ది ఇక లేరనే వాస్తవాన్ని జీర్ణించుకోలేక కేసీఆర్ కంట కన్నీరు కనిపించింది. పార్టీ ముఖ్య నాయకులు ఆయనను అనునయించడంతో కొంత తేరుకున్నారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభం నుంచి వరంగల్ జిల్లాలో ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, పార్టీ నిర్మాణంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన కీలక పాత్రను కేసీఆర్ బాధాతప్త హృదయంతో స్మరించుకున్నారు. పెద్ది తనకు కేవలం పార్టీ నాయకుడే కాకుండా ఆత్మీయుడని గుర్తు చేసుకున్నారు. పిల్లలను బాగా చదివించాలని, వారికి తండ్రి లేని లోటు తెలియకుండా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు.

### ప్రజాభివృద్ధికి పాటుపడే

## ఎమ్మెల్యే దొరకడం అదృష్టం

### జాబ్ మేళా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

### మెగా జాబ్ మేళాలో సీపీ సాయి చైతన్య

### రెండున్నర వేలకుపైగా నిరుద్యోగులు హాజరు

### ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

02



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ప్రజాభివృద్ధికి పాటుపడే ఎమ్మెల్యే దొరకడం నిజామాబాద్ యువత అదృష్టమని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీరామ గార్డెన్ లో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ... ఇంత పెద్ద మొత్తంలో జాబ్ మేళా నిర్వహించటం అభినందనీయమన్నారు. రాజకీయంతో పాటు ప్రజల అభివృద్ధికి పాటుపడే వారు అరుదుగా ఉంటారన్నారు. ఇలాంటి అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్నాలజీని వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కానీ అదే టెక్నాలజీకి వ్యసనం కాకూడదని సూచించారు.

## బోనాల వేడుకల్లో పోచారం

### అమ్మవారికి ప్రత్యేక పూజలు

బాన్సువాడ, బతుకమ్మ :ఆషాఢమాసం సందర్భంగా హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని ఖిల్లా మైసమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల మహోత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ జియాగూడ సబ్జీ మండి మహంకాళి ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానం మేరకు మహంకాళి అమ్మవారి బోనాల పండుగలో పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో గజరాజు గజమాలతో పోచారం శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించి ఆశీర్వదిస్తూ స్వాగ తం పలికింది. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తెలం గాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతి నిధులు, నాయకులు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## లాల్ దర్వాజ మహాకాళి అమ్మవారికి బోనం సమర్పించిన కవిత





హైదరాబాద్, బతుకమ్మ లాల్ దర్వాజలోని శ్రీ సింహవాహిని మహాకాళి అమ్మవారిని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించి, నూతనంగా ఏర్పాటు చేసిన తమ పార్టీకి అమ్మవారి ఆశీస్సులు అందాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, బోనాల ఏర్పాట్ల విషయంలో ప్రభుత్వం మూడేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ధ్వజస్తంభం ఏర్పాటు, విగ్రహ పునఃప్రతిష్ఠ వంటి పలు అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమవుతోందని, ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని ఆమె అన్నారు. బోనం ఎత్తుకుని సింహవాహిని అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన ఆడబిడ్డలందరికీ ఆమె శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి దయతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. "ఇవాళ ఒక ఆడబిడ్డగా నేను కొత్త పార్టీ ఏర్పాటు చేసి అమ్మవారి ఆశీర్వాదం కోసం ఇక్కడికి వచ్చాను. మా పార్టీకి కొత్త శక్తిని, ప్రజలకు సేవ చేసే సత్తువను కల్పించాలని అమ్మవారిని ప్రార్థించాను" అని కవిత పేర్కొన్నారు.

## ఘనంగా తీజ్ పండుగ ఉత్సవాలు

02



బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ మండలం పోచారం తండా, రాంపూర్ తండాల్లో తీజ్ పండుగ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు,ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బంజారా సోదర సోదరీమణులకు పోచారం శ్రీనివాసరెడ్డి తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బంజారా మహిళలు సంప్రదాయ పద్ధతిలో పెంచిన గోధుమ గడ్డి బుట్టలను (తీజ్) ఎత్తుకుని నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలతో కలిసి పోచారం ఉత్సాహంగా నృత్యం చేస్తూ పండుగ సంబరాల్లో భాగస్వాములయ్యారు. తండాల్లో తీజ్ పండుగ సందర్భంగా సంప్రదాయ నృత్యాలు, పాటలతో సందడి నెలకొంది. ఈ వేడుకలకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువతతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

# ఎమ్మెల్యే దొరకడం అదృష్టం

ఉద్యోగాలు రానివాళ్లు నిరాశ చెందకుండా మరింత ప్రయత్నించాలన్నారు. ప్రస్తుత ప్రయత్నాన్ని అనుభవంగా పొంది భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిదుకోవాలన్నారు. ఇందూరు యువతలో ఎంతో ప్రతిభ దాగి ఉంది, వారి ప్రతిభకు అవకాశం కల్పించడం కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. ఇందూరు భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లల్ని చదివిస్తారని, తన బిడ్డ మంచి ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడాలనేది వారి కోరిక అన్నారు. యువతకు ఉద్యోగం కల్పించడం అంటే కేవలం ఒక వ్యక్తికి ఉద్యోగం ఇవ్వడం కాదని ఒక కుటుంబానికి భరోసా ఇవ్వడం అని స్పష్టం చేశారు. యువతకు సరైన వేదిక దొరకడం లేదని ఆ సమస్యను దృష్టిలో పెట్టుకొని 70కి పైగా కంపెనీలను ఒకే వేదిక పైకి తీసుకోవచ్చామని తెలిపారు. ఇంటర్వ్యూలకు వెళ్లినప్పుడు భయపడకుండా తమపై నమ్మకం పెట్టుకోవాలన్నారు. యువత ఉద్యోగాల కోసం తప్పనిసరిగా హైదరాబాద్కు ఇతర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గాలన్నారు. నిజామాబాదులో అవకాశాలు పెరగాలని అదే తన లక్ష్యమని పేర్కొన్నారు. నిజామాబాద్ ను ఐటీ హబ్ గా మార్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నానన్నారు ఇటీవల ఐటీ శాఖామంత్రి శ్రీధర్ బాబును కలిసి పలు ప్రతిపాదనలు అందజేయడం జరిగిందన్నారు. త్వరలోనే నిజామాబాద్ ను ఐటీ హబ్ గా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో యువతకు తోడుగా నిలుస్తామని చెప్పారు. జాబ్ మేళాకు సుమారు రెండున్నర వేలకుపైగా అభ్యర్థులు హాజరయ్యారు. అనంతరం ఆయా కంపెనీలో ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, మఠం పవన్, శ్రవణ్, పసునూరి రాము, ప్రసూన శ్రీనివాస్, ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, బంటు రాము, బంటు ప్రీతి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# పెద్ది జ్ఞాపకాల్లో కేసీఆర్ కంట కన్నీరు



పెద్ది భార్య స్వప్నకు గుండె ధైర్యం నింపగా, తల్లి అమృతమ్మకు ధైర్యవచనాలు చెప్పారు. ఇప్పటికే ప్రకటించిన విధంగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయల చొప్పున మొత్తం రూ.2 కోట్ల ఆర్థిక సాయం చెక్కులను కేసీఆర్ అందజేశారు. అదే సమయంలో పెద్ది తల్లి అమృతమ్మకు రూ.25 లక్షల చెక్కును కూడా అందించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నల్లబెల్లికి తరలివచ్చారు. దీంతో నల్లబెల్లి–నర్సంపేట రహదారులు, పరిసర ప్రాంతాలు జనసందోహంతో నిండిపోయాయి. "పెద్ది సుదర్శన్ రెడ్డి అమర్ రహే.. జోహార్ పెద్ది సుదర్శన్ రెడ్డి.. జై తెలంగాణ.. కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. నల్లబెల్లికి వస్తున్న మార్గంలో పలుచోట్ల కార్యకర్తలు కేసీఆర్‌కు పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపారు. తమ పార్టీ కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా భావించే కేసీఆర్, మార్గమధ్యంలో కాన్వాయ్‌ను ఆపి వారిని పలకరించారు. "అధైర్యపడొద్దు.. మీకు నేనున్నాను" అంటూ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. పెద్ది కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని పునరుద్ఘాటించిన కేసీఆర్, అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలను పలకరించిన అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. అనంతరం వరంగల్‌లో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని, పార్టీ సీనియర్ నేతలు, జిల్లా ముఖ్య నాయకులతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి నాయకులు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

### నగర కార్యదర్శి కామ్రేడ్ నీలం సాయి బాబా

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న యువత, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్మించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నిజామాబాద్ నగర కార్యదర్శి కామ్రేడ్ నీలం సాయిబాబా పిలుపునిచ్చారు. కోటగల్లీలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) నిజామాబాద్ నగర 9వ మహాసభ ఆదివారం నిర్వహించారు. మహాసభ ప్రారంభానికి ముందు పీవైఎల్ తొలి కన్వీనర్ కామ్రేడ్ వేములపల్లి కిరణ్ కుమార్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువజన ఉద్యమంలో అమరులైన వీరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాలుగు దశాబ్దాలుగా పీవైఎల్ ఆధ్వర్యంలో యువజన ఉద్యమాలు కొనసాగుతున్నాయని అన్నారు. గుట్కా, సింగిల్ నంబర్ లాటరీలకు వ్యతిరేకంగా ఉద్యమించి నిషేధం సాధించడంలో పీవైఎల్ పోషించిన పాత్రను ఆయన అభినందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు బానిసలుగా మారుస్తూ తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నాయని సాయిబాబా ఆరోపించారు. దేశంలో యువత సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ వారికి సరైన ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ఉపాధి కోసం యువత విదేశాలకు, ముఖ్యంగా అరబ్ దేశాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. యువత సంక్షేమానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన జెన్–జీ ఉద్యమాల స్ఫూర్తితో బలమైన యువజన ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. పీవైఎల్ జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ వనమాల సత్యం మాట్లాడుతూ, జిల్లాలో పీవైఎల్ అనేక ప్రజా, యువజన సమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్మించిందన్నారు. సింగిల్ నంబర్ లాటరీల కారణంగా ఆర్థికంగా నష్టపోతున్న యువతను కాపాడేందుకు దశలవారీగా ఉద్యమించి విజయం సాధించామని తెలిపారు. ఆరోగ్యానికి హానికరమైన గుట్కాకు వ్యతిరేకంగా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఉద్యమాలు నిర్వహించి, పలు దఫాలుగా 'చలో హైదరాబాద్' కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. గుట్కా నిషేధాన్ని ప్రస్తుత పాలకులు సమర్థవంతంగా అమలు చేయడం లేదని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని సత్యం విమర్శించారు. యువత మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు విస్తృతంగా క్రీడా




కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ ఎం. శివకుమార్ మాట్లాడుతూ, యువత కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు రూపొందించేలా పీవైఎల్ నాయకత్వంలో ఉద్యమాలు చేపట్టాలని కోరారు. యువతకు ఉపాధి కల్పించడంలో, కార్మికులకు సరైన సౌకర్యాలు అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. కార్మికులు, యువత కలిసి సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహాసభలో పీవైఎల్ ఉపాధ్యక్షులు బండమీది నరసయ్య, మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రమేష్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జి. గోపాల్ తదితరులు ప్రసంగించారు. యువజన నాయకులు తాంపే రాజు మహాసభకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు దాసు, పీరయ్య, వినయ్, లక్ష్మణ్, ఐఎఫ్ టియు నాయకులు మోహన్, శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజులపై

# ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలి




### పీడీఎస్ యు జిల్లా అధ్యక్షుడు కర్క గణేష్

డిచ్‌పల్లి, బతుకమ్మ :ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థుల నుంచి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేయకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్ యు జిల్లా అధ్యక్షుడు కర్క గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాంపూర్‌లో డిచ్‌పల్లి మండల పీడీఎస్ యూ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు కర్క గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. అనిల్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగంగా ప్రదర్శించాలని విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశాలు జారీ చేయడం స్వాగతించదగ్గ విషయమన్నారు. పాఠశాలల అధికారిక వెబ్‌సైట్లలోనూ ఫీజుల వివరాలను అందుబాటులో ఉంచాలన్న నిర్ణయం పారదర్శకతకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అయితే కేవలం ఫీజుల వివరాలను ప్రదర్శించడం మాత్రమే కాకుండా, ప్రతి తరగతికి ఎంత ఫీజు వసూలు చేయాలనే అంశంపై తెలంగాణ ప్రభుత్వం ముందుగానే స్పష్టమైన ఫీజు పరిమితులు, మార్గదర్శకాలను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. తమిళనాడు ప్రభుత్వం చేపట్టిన విధానాలను ఆదర్శంగా తీసుకుని, తెలంగాణలోనూ ప్రతి తరగతికి సంబంధించిన ఫీజు పరిమితులను ప్రభుత్వం ముందుగానే ప్రకటించి, వాటిని పాఠశాలలు తప్పనిసరిగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం అనేక ప్రైవేట్ పాఠశా లలు ట్యూషన్ ఫీజు, అడ్మిషన్ ఫీజు, పుస్తకాలు, యూనిఫాం తదితర పేర్లతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని నాయకులు ఆరోపించారు. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేయాలంటే సమగ్ర ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే తరగతి వారీగా ఫీజు పరిమితుల ను ప్రభుత్వం ప్రకటించాలని, అన్ని పాఠశాలలు నిర్దేశిత పరిమితుల్లోనే ఫీజులు వసూలు చేసేలా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే పాఠశా లలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే వాటి గుర్తింపును రద్దు చేయాలని కోరారు. విద్య వ్యాపారం కాదు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత. తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించి, విద్యార్థుల హక్కులను కాపాడేందుకు ఫీజుల నియంత్రణను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని పీడీఎస్ యూ నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే. అఫ్జర్, ఎండి. నసీర్, జిల్లా సహాయ కార్యదర్శి అల్లోట్ సృజన్, జిల్లా నాయకులు మణితేజ, కార్తీక్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ పండుగ సమాజంలో ఐక్యతని పెంపొందిస్తుంది

## నగర మేయర్ కూరగాయల ఉమారాణి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తీజ్ వంటి సంప్రదాయ పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని నగర మేయర్ కూరగాయల ఉమారాణి పేర్కొన్నారు. నిజామాబాద్ నగర తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కంటేశ్వర్‌లోని పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన గోర్ బంజారా తీజ్ ఉత్సవ కార్యక్రమానికి మేయర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన మేయర్‌ను తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తీజ్ ఉత్సవం యొక్క ప్రాముఖ్యత, గోర్ బంజారా సమాజంలో దాని సాంస్కృతిక, సామాజిక విలువలను కమిటీ



సభ్యులు మేయర్‌కు వివరించారు. తదుపరి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో మేయర్ పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం తీజ్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించిన నిర్వాహకులకు ఆమె



అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీజ్ ఉత్సవ వేడుకలను ఆస్వాదించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పూజా కార్యక్రమాలతో ఉత్సవ ప్రాంగణం సందడిగా మారింది. గోర్ బంజారా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# ఆదివాసీల వాస్తవ జనాభాను గుర్తించి హక్కులు కల్పించాలి

## నాయక్ పోడ్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల రామచందర్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఆదివాసీల వాస్తవ జనాభాను ప్రభుత్వం గుర్తించి, జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, ఇతర హక్కులు కల్పించాలని నిజామాబాద్ జిల్లా నాయక్‌పోడ్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల రామచందర్ డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆయన ఆదివాసీ నాయక్‌పోడ్ సోదర, సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవితో అనుబంధం, ప్రకృతితో సహజీవనం కొనసాగిస్తూ, జల్--జంగల్--జమీన్‌ను కాపాడుతూ తమ సంస్కృతి, సంప్రదాయాలను తరతరాలుగా కొనసాగిస్తున్న ఆదివాసీలు ప్రకృతికి నిజమైన రక్షకులని అన్నారు. రాష్ట్రంలో ఆదివాసీల జనాభా సుమారు 6.50 లక్షలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం కేవలం 16 వేల మంది మాత్రమే ఉన్నట్లు చూపించడం బాధాకరమని గాండ్ల రామచందర్ అన్నారు. ఆదివాసీ నాయక్‌పోడ్ విద్యార్థులు ఉన్నత విద్య కోసం కౌన్సెలింగ్‌కు వెళ్లిన సమయంలో అధికారులు రకరకాల ప్రశ్నలు అడుగుతూ, హోల్డింగ్‌లో ఉంచి ఎంక్వాయిరీ పేరుతో కాలయాపన చేయడం సరికాదని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ అంశాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై ప్రభుత్వం విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిని సంబంధిత పదవుల నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు రామచందర్ తెలిపారు. ఈ సమస్యలను త్వరలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్, ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు ఆయన వెల్లడించారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ప్రతి జిల్లాలో సుమారు 30 వేల మంది ఆదివాసీలతో కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడి, ధర్నా కార్యక్రమాలు చేపడతామని గాండ్ల రామచందర్ హెచ్చరించారు. ఆదివాసీ హక్కులు, విద్యార్థుల



భవిష్యత్తు కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారు భోజన్న, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ విట్టల్ రావు, కోశాధికారి పవన్ కుమార్, అధికార ప్రతినిధి దుర్గా మల్లేష్, ఉద్యోగ సేవా సంఘం కార్యదర్శి గంట గంగాధర్, జిల్లా డీఆర్ డిఎ అధికారి సాయన్న, సేవా సంఘం ఉపాధ్యక్షులు దాత్రి అంజయ్య, డాక్టర్ విజయ్ కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన సంస్థ యువజన కాంగ్రెస్

## నిజామాబాద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :దేశంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన సంస్థగా యువజన కాంగ్రెస్ నిలిచిందని, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిజామాబాద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్ తెలిపారు. ఆదివారం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు శరత్ కుమార్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విపుల్ గౌడ్ మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు మహాత్మా గాంధీ దేశ ప్రజలను ఏకం చేసి స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపించారని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ చరిత్రను చెరిపివేసే విధంగా



వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడంలో యువజన కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని విపుల్ గౌడ్ పేర్కొన్నారు. యువత సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డి, యాదగిరి, ప్రవీణ్ గౌడ్, రాజేంద్ర ప్రసాద్, సుధాకర్, ఖుద్దూస్, వాహీద్, ప్రమోద్, మొయిాన్ యూనస్, సంతోష్, బలరాం, పోల ఉష, రవి, గంగారెడ్డి, రఘువీర్, అనుపాల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకుడిపై పోక్సో కేసు

### ఖమ్మం జిల్లాలో బాలికపై లైంగిక దాడి యత్నం

వెబ్ డెస్క్, బతుకమ్మ :ఖమ్మం జిల్లా వైరా పట్టణంలో 11 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలంగాణ రక్షణ సేన పార్టీ ఇన్‌చార్జ్ గౌరవరపు డేవిడ్ రాజ్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆరో తరగతి బాలిక వద్దకు నిందితుడు వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. లెక్కలు చెబుతానంటూ ఇంట్లోకి ప్రవేశించి బాలికపై లైంగిక దాడికి యత్నించినట్లు బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితుడు గౌరవరపు డేవిడ్ రాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# చంద్రనగర్‌లో ఘనంగా బోనాల పండగ





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నగరంలోని డివిజన్ నంబర్ 7 చంద్రనగర్ ప్రాంతంలోని శ్రీశ్రీశ్రీ పుట్ట మైసమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల పండగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ ఆలయానికి చేరుకుని పుట్ట మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళ హార తులు సమర్పించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందిం చారు. బోనాల పండగ భక్తి భావంతో, సామూహిక ఉత్సాహంతో నిర్వ హించడం ఆనందదాయకమని ఆమె పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సు లతో చంద్రనగర్ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురా రోగ్యా లతో ఉండాలని మేయర్ ఆకాంక్షించారు. పండగ సందర్భంగా పెద్ద సంఖ్యలో కాలనీవాసులు, భక్తులు, మహిళలు, పిల్లలు పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. దేవాలయ కమిటీ సభ్యులు మేయర్‌కు సాదర స్వాగతం పలికి, ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు, బోనా ల పండగ ఏర్పాట్ల వివరాలను వివరించారు. భక్తుల సమ్మేళనంతో చంద్ర నగర్ ప్రాంతం పండగ వాతావరణంతో కళకళలాడిందని మేయ ర్ అన్నారు. దేవాలయ అభివృద్ధికి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తగిన సహకారం అందించాలని మేయర్ సూచించారు. కార్య క్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన దేవాలయ కమిటీ సభ్యులను, పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాలనీవాసులను ఆమె అభినందించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సాంస్కృతిక, మతపరమైన కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని మరింత పెంపొందిస్తాయని మేయర్ పేర్కొన్నారు.

# మహేష్ బాబు జన్మదినం సందర్భంగా అన్నదానం



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని కోట గల్లీలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సఖి సతీష్ మాట్లాడుతూ.. చిన్నారులకు సొంత ఖర్చులతో గుండె ఆపరేషన్లు చేయిస్తూ మహేష్ బాబు అందిస్తున్న సేవా స్ఫూర్తితో ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మహేష్ బాబు సేవా కార్యక్రమాల స్ఫూర్తితో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్టార్ మహేష్ బాబు జిల్లా కమిటీ నాయకులు భూపతి రిషికేష్, నగర కమిటీ నాయకులు పాశికంటి మహేష్, చంద్రశేఖర్, స్వర్గం రమేష్, సాధు సతీష్, సాధు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో యువకుల పాత్ర కీలకం

మోర్తాడ్, బతుకమ్మ :రాజకీయాల్లో యువకుల పాత్ర కీలకమైందని మోర్తాడ్ మండల యువత అధ్యక్షుడు అడ్వల మనోజ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం 65వ యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన కాంగ్రెస్ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ టౌన్ యూత్ ప్రెసిడెంట్ పుప్పాల రాజేష్, సుంకెట్ యూత్ ప్రెసిడెంట్ గాండ్ల ప్రవీణ్, దొన్కల్ యూత్ ప్రెసిడెంట్ బాస మల్లికార్జున్, ఏఎంసీ డైరెక్టర్ నవీద్, మండల కాంగ్రెస్ నాయకులు జిన్న అరుణ్, బొట్టు రవి, కంఠం ప్రదీప్, దుంపేట ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



## రేకుల షెడ్ ధ్వంసం

### దాడి చేశారంటూ ఫిర్యాదు



బోధన్, బతుకమ్మ :తన స్థలంలో నిర్మించుకున్న రేకుల షెడ్‌ను ధ్వంసం చేసి, తనపై, కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సాలుర గ్రామానికి చెందిన ఆలేవర్ ఆనంద్ బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బోధన్ ఎస్‌హెచ్‌ఓకు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. సాలుర శివారులోని సర్వే నంబర్ 1962లో 242 చదరపు గజాల స్థలాన్ని రిజిస్టర్ సేల్ డీడ్ నంబర్ 2252/2023 ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ అనుమతులతో అక్కడ రేకుల షెడ్ నిర్మాణంతో పాటు ఫ్లోరింగ్ టైల్స్ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 8న సాలుర గ్రామ సర్పంచ్ భర్త సోలం రవి, ఉప సర్పంచ్ సురేష్ పటేల్, డిస్కో సాయిలు, వార్డు సభ్యులు జాఫర్, కల్లూరి బాసిర్, గైని అరవింద్, బగం శ్రీకాంత్ తదితరులు గుంపుగా వచ్చి తన స్థలంలోకి ప్రవేశించారని ఆనంద్ ఆరోపించారు. అక్కడ ఉన్న రేకులు, ఫ్లోరింగ్ టైల్స్‌ను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అనంతరం తనను, కుటుంబ సభ్యులను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా డిస్కో సాయిలు తనను రూ.లక్ష డిమాండ్ చేశారని, డబ్బులు ఇవ్వకపోవడంతోనే దాడికి పాల్పడ్డారని ఆనంద్ ఆరోపించారు. ఈ ఘటనలో సుమారు రూ.50 వేల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు. స్థల వివాదానికి సంబంధించి గతంలోనే గ్రామ పంచాయతీకి లీగల్ నోటీసు ఇచ్చినట్లు ఆనంద్ పేర్కొన్నారు. తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, ఘటనకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బోధన్ పోలీసులను కోరారు. తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. ఈ ఆరోపణలపై పోలీసుల స్పందన, దర్యాప్తు వివరాలు తెలియాల్సి ఉంది.

## సిద్ధరామేశ్వర నగర్‌లో ఘనంగా మైసమ్మ బోనాలు

భిక్కనూరు, బతుకమ్మ :భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వర నగర్‌లో ఆషాడ మాసం సందర్భంగా మైసమ్మ బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలను తలపై పెట్టుకుని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డోలు చప్పుళ్లు, పోతరాజుల నృత్యాలతో వాతావరణం భక్తిమయంగా మారింది. భక్తుల సహాయార్థం గ్రామపంచాయతీ, ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయ కమిటీ సభ్యులు అనసూయ రెడ్డి, సర్పంచ్ జనగామ రాణి శ్రీనివాస్, నార్సింపేట స్వామి వీడీసీ అధ్యక్షులు అరుణ్, బత్తుల నాగులు, నర్సింలు, వీడీసీ వైస్ ప్రెసిడెంట్ గొల్ల రాజు, సిద్ధూ,ఎలుగునరేష్, శివా నందు, సిద్ధ రాములు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# ఆదివాసీల హక్కులను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత

### రాష్ట్ర మంత్రి ధనసూరి అనసూయ సీతక్క

వెబ్ డెస్క్, బతుకమ్మ :ఆదివాసీల హక్కుల పరిరక్షణకు రాజ్యాంగం ప్రత్యేక రక్షణలు కల్పించిందని, వాటిని సమర్థవంతంగా అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అశ్వరావుపేటలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు కొమరం భీమ్ విగ్రహాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన భారీ ర్యాలీ 'జై ఆదివాసీ' నినాదాలతో మారుమోగింది. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసీల చరిత్ర హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం కోసం సాగిన పోరాటాల చరిత్రేనని అన్నారు. సమ్మక్క-సారక్క, బిర్సా ముండా, రాంజీ గోండు, కొమరం భీమ్ వంటి ఆదివాసీ నాయకులు తమ హక్కులు, స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం పోరాడారని ఆమె గుర్తు చేశారు. ఆదివాసీ హక్కుల కోసం పోరాడటం ఇతర వర్గాలకు వ్యతిరేకం కాదని మంత్రి స్పష్టం చేశారు. అన్ని వర్గాలతో సోదరభావంతో కలిసి ముందుకు సాగుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవాలని ఆదివాసీ సమాజానికి పిలుపునిచ్చారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధితో పాటు ఇళ్లు, ఉద్యోగాలు, అడవిపై హక్కుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, వేషధారణ వారి అస్తిత్వానికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసీ సమాజం అభివృద్ధి, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ దిశగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. వేడుకల అనంతరం మంత్రి సీతక్క అశ్వరావుపేటలోని మహిళా సమాఖ్య



భవనాన్ని సందర్శించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు.

# బోనాల పండుగ ప్రజల్లో ఐక్యతని చాటి చెబుతుంది

### డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ప్రజల్లో ఐక్యత, సామరస్యాన్ని చాటిచెబుతుందని డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ పేర్కొన్నారు. నగరంలో ఆదివారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల కార్యక్రమాల్లో నగర డీసీసీ అధ్యక్షులు పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రాన్స్ జెండర్ల ఆధ్వర్యంలో, గాండ్ల సంఘం ఆధ్వర్యంలో, బొబ్బిలి వీధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, అలాగే పోచమ్మగుడి ఎస్సీ బస్తీ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమాల్లో రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ మన జీవన విధానానికి, భక్తి పారవశ్యానికి, ఆచార వ్యవహారాలకు నిలువెత్తు రూపం ఆషాధ మాసంలో జరుపుకునే బోనాల పండుగని అన్నారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, కన్నులపండువగా బోనాల పండుగను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని రామకృష్ణ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా సంఘాల ప్రతినిధులు, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా అవర్ సురేష్



బిచ్కుంద, బతుకమ్మ :మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా అవర్ సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు ఆయనకు అభినందనలు తెలిపారు. అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం అవర్ సురేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను మనసా, వాచా, కర్మణా నిబద్ధతతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు, సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని అవర్ సురేష్ హామీ ఇచ్చారు. సంఘ సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతానని తెలిపారు. అవర్ సురేష్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# బోగిని మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన సీనియర్ కౌన్సిల్ వి. రఘునాథ్

నాగర్ కర్నూల్, బతుకమ్మ :నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ అసెంబ్లీ పరిధిలోని పెంట్లవెల్లి గ్రామానికి చెందిన అడ్వకేట్, ఆర్‌ఎంపీ డాక్టర్ బోగిని మల్లయ్య కుటుంబాన్ని తెలంగాణ హైకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ కౌన్సిల్, బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ సభ్యుడు వి. రఘునాథ్ పరామర్శించారు. జూలై 31, 2026న బోగిని మల్లయ్య దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొల్లాపూర్ బార్ అసోసియేషన్ సభ్యులు కురుమయ్య, నిరంజన్, నాగర్‌కర్నూల్ బార్ అసోసియేషన్ సభ్యుడు బోనాసి రాంచందర్‌తో పాటు పలువురు న్యాయవాదులు, సీనియర్ కౌన్సిల్ వి. రఘునాథ్ కలిసి మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను తెలుసుకునేందుకు నిజనిర్ధారణ కమిటీ మల్లయ్య భార్య బోగిని మణెమ్మతో మాట్లాడింది.

. . . ముందుగానే పోలీసులకు ఫిర్యాదు చేశాం : మణెమ్మ

తన భర్తపై దాడి జరిగే ప్రమాదం ఉందని హత్యకు ముందే పలుమార్లు పోలీసులను కలిసి ఫిర్యాదు చేసినట్లు మణెమ్మ వెల్లడించారు. తన భర్త ప్రాణాలకు ముప్పు ఉందని సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసినప్పటికీ, పోలీసులు ముందస్తు చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త హత్యకు గురయ్యారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇదే వ్యక్తులు తన భర్తపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని, ఆ ఘటనపై ఎఫ్ఐఆర్ సైతం నమోదైందని మణెమ్మ తెలిపారు. హత్యకు కొద్ది రోజుల ముందు కూడా మల్లయ్య తన సహచర న్యాయవాదులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, తన ప్రాణాలకు ముప్పు ఉందని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు ఎలాంటి రక్షణ కల్పించలేదని ఆమె పేర్కొన్నారు.

. . . భూమి వివాదమే హత్యకు కారణమా ?

2007లో రిజిస్టర్ సేల్ డీడ్ ద్వారా కొనుగోలు చేసిన భూమిపై కొందరు వ్యక్తులు కన్నేశారని మణెమ్మ ఆరోపించారు. భూమి విలువ పెరగడంతో దానిని అక్రమంగా స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతోనే తన భర్తను హత్య చేశారని ఆమె ఆరోపించారు. ఈ ఘటన వెనుక స్థానిక రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని కూడా మణెమ్మ ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో తన భర్తపై దాడి జరిగినప్పుడు అప్పటి అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు నిందితులకు సహకరించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ స్థానిక నాయకులు నిందితుల వైపే నిలుస్తున్నారని ఆమె ఆరోపించారు. తన భర్త కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఎంతోకాలంగా మద్దతుగా ఉన్నప్పటికీ, ఆయన హత్య అనంతరం పార్టీ నుంచి కుటుంబానికి ఆశించిన స్థాయిలో సహాయం అందలేదని మణెమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ అండదండల కారణంగానే నిందితులు ధైర్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు.

. . . ప్రధాన నిందితుల అరెస్టుపై అసంతృప్తి

హత్య జరిగి రోజులు గడుస్తున్నా ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేయకపోవడంపై మణెమ్మ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ పోలీసుల వద్ద అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అవసరమైన వనరులు ఉన్నప్పటికీ నిందితులను పట్టుకోలేకపోవడానికి రాజకీయ ఒత్తిళ్లు, రాజకీయ అండదండలే కారణమని ఆమె ఆరోపించారు. తన భర్త హత్య కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి, నిందితులందరినీ వెంటనే అరెస్ట్ చేయడంతో పాటు తమ కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, జిల్లా పోలీసు ఉన్నతాధికారులను మణెమ్మ కోరారు. మల్లయ్య కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరించిన నిజనిర్ధారణ కమిటీ, ఘటనకు సంబంధించిన అంశాలను పరిశీలించి తదుపరి చర్యలపై దృష్టి సారించనున్నట్లు సమాచారం.



# తిరుమలలో నకిలీ ఆధార్ కార్డులతో గదుల దందా

### ఆరుగురు రూమ్ దళారీల అరెస్ట్

వెబ్ డెస్క్, బతుకమ్మ : భక్తులకు కేటాయించే వసతి గదులను నకిలీ ఆధార్ కార్డులు, మార్ఫింగ్ చేసిన ఫొటోలతో అక్రమంగా పొందుతూ, వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్న రూమ్ దళారీల ముఠాను తిరుమల టూ టౌన్ పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి నకిలీ ఆధార్ కార్డులు, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ ఆదేశాల మేరకు తిరుమలలో రూమ్ దళారీల అక్రమ కార్యకలాపాలపై పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇరు విభాగాల సిబ్బంది సమన్వయంతో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా కొనసాగించారు. ఈ క్రమంలో ఆగస్టు 8న ఉదయం తిరుమల సీఆర్వో కార్యాలయం వద్ద అనుమానాస్పదంగా గదులు పొందేందుకు ప్రయత్నిస్తున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, నకిలీ ఆధార్ కార్డులు, మార్ఫింగ్ చేసిన ఫొటోల ద్వారా గదులను పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. టీటీడీ నిర్ణయించిన ధరలకు భక్తులకు కేటాయించే గదులను అక్రమంగా పొంది, వాటిని అధిక ధరలకు విక్రయించడం ద్వారా భక్తులను మోసం చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితుల వద్ద నుంచి నకిలీ ఆధార్ కార్డులు, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తిరుమలలో గదుల పేరుతో దళారులను ఆశ్రయించి మోసపోవద్దని పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు భక్తులకు సూచించారు. టీటీడీ అధికారిక మార్గాల్లోనే వసతి గదులను బుక్ చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు అధిక ధరలకు గదులు ఇప్పిస్తామని చెబితే వెంటనే పోలీసులకు లేదా విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. రూమ్ దళారుల అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు తిరుమలలో ప్రత్యేక నిఘా, తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని అధికారులు తెలిపారు.



# గొడ్డలితో కొడుకుపై దాడి

### తండ్రి అరెస్ట్

వెబ్ డెస్క్, బతుకమ్మ :కొడుకు వేధింపులు తాళలేక నిద్రిస్తున్న సమయంలో గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన తండ్రిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన కోనరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మల్కపేట గ్రామానికి చెందిన గుడిపేట రాఘవులు అలియాస్ రాఘవరెడ్డికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు గుడిపేట రాజేందర్ ఎలాంటి పని చేయకుండా తండ్రిని వేధించడంతో పాటు కొట్టడం, అప్పులు చెల్లించకుండా కుటుంబంలో తరచూ గొడవలు చేయడం చేసేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఆగస్టు 8న మధ్యాహ్నం ఫ్యాన్ విషయంలో రాజేందర్ తన తండ్రితో గొడవపడి అతడిపై దాడి చేశాడు. దీంతో తీవ్రంగా విసిగిపోయిన రాఘవరెడ్డి.. తన కుమారుడి వల్ల భవిష్యత్తులో కూడా ఇబ్బందులు ఎదురవుతాయని భావించి, అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల మధ్య నిద్రిస్తున్న రాజేందర్‌పై గొడ్డలితో దాడి చేశాడు. తల, ముఖంపై గొడ్డలితో నరకడంతో రాజేందర్ తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన రాజేందర్‌ను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు గుడిపేట రాఘవులు అలియాస్ రాఘవరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. చందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసిన కోనరావుపేట ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి, స్టేషన్ సిబ్బందిని సీఐ కె. రవీందర్ ఈ సందర్భంగా అభినందించారు.




## ఏర్గట్ల ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా తనిఖీ బృందం



ఏర్గట్ల, బతుకమ్మ :పీఎం శ్రీ ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా తనిఖీ బృందం సందర్శించి పాఠశాలలోని విద్యా, మౌలిక వసతులు, విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల బోధనా విధానాలను సమగ్రంగా పరిశీలించింది. తనిఖీలో భాగంగా అధికారులు తరగతి గదులను సందర్శించి విద్యార్థుల ప్రతిభ, వారి ప్రదర్శన, ఉపాధ్యాయుల బోధనా పనితీరును పరిశీలించారు. అలాగే పాఠ్యప్రణాళికలు, వార్షిక ప్రణాళికలు, టీచర్ డైరీలను తనిఖీ చేశారు. పాఠశాలలోని గ్రంథాలయ నిర్వహణ, సైన్స్ ల్యాబ్, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తనిఖీ బృందానికి నోడల్ అధికారిగా వచ్చిన వెంకటయ్య మాట్లాడుతూ పాఠశాలలో పరిస్థితులు అన్ని విధాలుగా బాగున్నాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతున్నారని, ఉపాధ్యాయుల పనితీరు కూడా చాలా చక్కగా ఉందని ప్రశంసించారు. పరిశీలనకు వచ్చిన సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను గమనించి వారిని అభినందించారు. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణాచారి మాట్లాడుతూ పాఠశాల ప్రస్తుతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. విద్యతో పాటు విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల పనితీరు కూడా మెరుగ్గా ఉందని తనిఖీ బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో తనిఖీ బృందం సభ్యులు కోకిల నాగరాజు, చిన్నయ్య, గంగామోహన్, గంట అశోక్, రమేష్, విశ్వనాథ్, గంగాధర్, రాచర్ల గంగాధర్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జ్



ఏర్గట్ల, బతుకమ్మ :ఏర్గట్ల మండల కేంద్రంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పలు బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఏర్గట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త గొల్ల వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ముత్యాల సునీల్ కుమార్ వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి సానుభూతి తెలిపారు. వెంకన్న పార్టీకి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా ఏర్గట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఏలేటి చిన్న బాలయ్యకు ఇటీవల గుండెకు శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకుని ఆయనను పరామర్శించారు. బాలయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్, మాజీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రేండ్ల రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం జీవన్ రెడ్డి, జింక అనిల్ కుమార్, మూస్కు మోహన్ రెడ్డి, బద్దం లింగారెడ్డి, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోరిపల్లి లింగారెడ్డి, మేకల సాయన్న, దండబోయిన సాయి, పన్నాల నర్సరెడ్డి, సుదన వేణి శ్రీనివాస్ గౌడ్, అన్నెల మురళి గౌడ్, పాకాల ప్రసాద్ గౌడ్‌తో పాటు ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా పండుగ సాయన్న 134వ జయంతి వేడుకలు

ఏర్గట్ల, బతుకమ్మ :ఏర్గట్ల మండల కేంద్రం లో బహుజన ముద్దుబిడ్డ పండుగ సాయన్న ముదిరాజ్ 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహం, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద స్థానిక ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామ యువకులు పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్గట్ల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రెండ్ల రవి, ఉపసర్పంచ్ ఫోరమ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మూడ్ దయానంద్, బీసీ--ఎస్సీ--ఎస్టీ మండల జాక్ అధ్యక్షుడు జూంగల గణేష్, రెండ్ల రాజారెడ్డి, మాజీ అధ్యక్షుడు జూంగల పెద్ద గంగారాం (బిగ్‌బాస్) మాట్లాడుతూ.. పండుగ సాయన్న ముదిరాజ్ నాటి తెలంగాణలో దొరలు, పెత్తందారులు, భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి పేదలు, అణగారిన వర్గాల ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. దోపిడీకి గురైన సంపదను స్వాధీనం చేసుకుని, అన్యాయానికి గురైన పేద ప్రజలకు పంచిపెట్టి వారి సంక్షేమం కోసం పండుగ సాయన్న పోరాడారని వారు తెలిపారు. ఆయన చేసిన సేవలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ బహుజన బిడ్డ పండుగ సాయన్న ముదిరాజ్ జీవిత చరిత్రను తెలుసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరపట్నం చిన్న గంగారాం, శ్రీనివాస్, రొక్కెడ సంజీవ్, కూరాకుల రమేష్, శ్రీనివాస్ గౌడ్, బాలు, గుర్రం చిరంజీవి, మచ్చ ప్రవీణ్, రామ్, లక్ష్మణ్, బుర్కాల ప్రభాకర్, మేహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



## చిక్కడ్ పల్లిలో ఘనంగా బోనాల పండుగ



రుద్రూర్, బతుకమ్మ : రుద్రూర్ మండలంలోని చిక్కడ్ పల్లి గ్రామంలో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం పోచమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి అనంతరం మధ్యాహ్నం చిన్న పెద్ద అందరు కలిసి భక్తిశ్రద్ధలతో భాజ భజంత్రీల మధ్య గ్రామంలోని మహిళలు నెత్తిన బోనమెత్తి పోచమ్మ తల్లికి సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మచ్కూరి రమేష్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుర్మరాజు, కార్యదర్శి గోపి, సలహాదారులు రాజయ్య, డా.మల్లేష్, కోశాధికారి జెల్ల పరమేష్, సభ్యులు కృష్ణార్జున్, కోలా శ్రీను, కొందరు అంజయ్య, సాయినాథ్, మాజీ సర్పంచ్ పుష్పలత రమేష్, పెద్ద హన్మంతు, గుడిసె హన్మంతు, జెల్ల సాయిలు, రవి, బస్వయ్య, అశోక్ తదితరులు, గ్రామస్తులు మహిళలు ఉన్నారు.

# దేశ స్వాతంత్ర్య విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత

### టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, బతుకమ్మ :దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. క్విట్ ఇండియా డే సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆదివారం ఆయన జెండా ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీ పుస్తక ప్రదర్శనను, గాంధీజీ విగ్రహాలను మహేష్ కుమార్ గౌడ్ ఇతర నాయకులతో కలిసి సందర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ అందించిన సేవలను, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకాటి శ్రీహరి, మహ్మద్ అజారుద్దీన్, ఎంపీ అనిల్ యాదవ్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సేవాదళ్ చైర్మన్ జితేందర్ ఆధ్వర్యంలో క్విట్ ఇండియా డే కార్యక్రమాలను నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమం అందించిన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడంతో పాటు దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

